క్లుప్తంగా

చల్లంగ చూడమ్మ అంకాలమ్మతల్లి



ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మతల్లి

పులివెందుల టౌన్ : తెలుగు సంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని గురువారం పార్న సందర్భంగా భక్తులు గ్రామదేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక అంకాలమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి వస్త్రాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. నూతన సంవత్సరం అంతా కలసి రావాలని..ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని వేడుకున్నారు. అలాగే పట్టణంలోని నడివీధి పెద్దమ్మ, పోలేపల్లె పోలేరమ్మ తల్లులకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా రామయ్యస్వామి తిరునాల



ప్రత్యేక పూజలు అందుకున్న రామయ్యస్వామి

చింతకొమ్మదిన్నె : మండలంలోని పాపాసాహెబ్‌పేట పంచాయతీ పరిధిలోని బాలుపల్లె గ్రామంలో వెలసిన కమ్మేటిపల్లె రామయ్యస్వామి తిరునాల గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఉగాది మరుసటి రోజు ఇక్కడ వెలసిన కమ్మేటిపల్లి రామయ్యస్వామి, నారాయణస్వామి, కంటి పాపులమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ ఆవరణలో నిర్వహించిన గుర్రపు స్వారీలు భక్తులను ఆకట్టుకున్నాయి.


బూజుపల్లె ఓబులేశునికి ప్రత్యేక పూజలు



ఓబులేశుస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

తొండూరు : మండలంలోని బూజుపల్లె గ్రామంలో వెలసిన ఓబులేశుస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది ఉగాది పండుగ మరుసటిరోజు పార్నరోజున బూచుపల్లె వంశస్తులందరూ బూచుపల్లె గ్రామంలో ఉన్న ఓబులేశుస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మండలంలోని తొండూరు, భద్రంపల్లె, ఇనగలూరు, పులివెందుల తదితర గ్రామాల్లో ఉన్న బూచుపల్లె వంశస్తులు ప్రతి ఏడాది అక్కడికి వెళ్లి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. భక్తులకు అర్చకులు నాగరాజుస్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్ఈ) ఆధ్వర్యంలో గురువారం భగత్ సింగ్ 92వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాలర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జమ్మలమడుగు ఏరియా కార్యదర్శి శరత్‌కుమార్, మండల కార్యదర్శి లీలాకృష్ణ తదితరలు పాల్గొన్నారు.

సాఫ్ట్‌టెన్నిస్ జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ

కడప స్పోర్ట్స్ : ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఈనెల 19 నుంచి 23 వరకు నిర్వహించిన జాతీయస్థాయి సాఫ్ట్‌టెన్నిస్ సీనియర్ మహిళల చాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీ జట్టు మూడోస్థానంలో నిలిచి కాంస్యపతకం సాధించింది. ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన జె.అభిగాలి చక్కటి ప్రతిభ కనబరిచి ఏపీ జట్టు మూడోస్థానంలో నిలవడంలో కీలకపాత్ర పోషించింది. వైఎస్‌ఆర్ కడప జిల్లా సాఫ్ట్‌టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డి.రేవంత్ జట్టు కోచ్‌గా వ్యవహరించారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత

- ప్రతి సచివాలయ పరిధిలో జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌లకు శ్రీకారం
- ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏర్పాటు
- ప్రతి నెలా గ్రామీణ, మండల స్థాయిల్లో టోర్నమెంట్ నిర్వహణ
- మూడు నెలలకోసారి జిల్లాస్థాయిలో ఇంటర్ క్లబ్ పోటీలు



ఎర్రగుంట్ల జెడ్పీ బాయ్స్ పాఠశాల



ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఎర్రగుంట్ల : రెండేళుగా జిల్లాలో ఎక్కడ చూసినా క్రీడా సంబరాలు జరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లా స్థాయి స్కూల్స్ గేమ్స్ క్రీడా పోటీలు, ఏపీ సీఎం కప్, జగనన్న క్రీడా పోటీలు జరుగుతున్నాయి. క్రీడాలను క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. గతంలో జిల్లాస్థాయిలో ఏదైనా క్రీడలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటే తప్పా ప్రోత్సహం ఉండేది కాదు. ఇప్పుడు క్రీడలపై ఆసక్తి గల ప్రతి ఒక్కరినీ ప్రోత్సహిస్తున్నారు. దీంతో జిల్లా నుంచి పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణిస్తున్నారు.

ప్రణాళికతో ఏర్పాటు..

ఒక్కో క్రీడకు ఒక్కో క్లబ్ చొప్పున.. మొత్తం గ్రామంలో 26 క్రీడాంశాలపై జగనన్న క్రీడా క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, పాలకమండలి సభ్యులతో కార్యకలాపాలు సాగించేలా రూపకల్పన చేస్తున్నారు. మూడు నెలలకు ఒకసారి మండల, నియోజవర్గ, జిల్లా స్థాయిల్లో స్పోర్ట్స్ క్లబ్‌లు పోటీలు నిర్వహించేలా మార్గదర్శకాలు సిద్ధం చేశారు. ఇప్పటికే శాప్ అధికారులు స్పోర్ట్స్ క్లబ్‌ల రిజిస్ట్రేషన్‌ను ప్రత్యేక యాప్ ద్వారా చేపడుతోంది.

పీఎస్ఏ, ఎంఎస్ఏ పర్యవేక్షణ..

గ్రామాల్లోని స్పోర్ట్స్ క్లబ్‌లను పంచాయతీ స్పోర్ట్స్ ఆథారిటీ (పీఎస్ఏ), మండల స్థాయిలో మండల స్పోర్ట్స్ ఆథారిటీ (ఎంఎస్ఏ), పర్యవేక్షించనున్నాయి. సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో నిధులు సమకూర్చుకుంటూ ఈ క్లబ్‌లు క్రీడా కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. సర్పంచ్‌గా చైర్మన్‌గా ఉండే పీఎస్ఏలో పంచాయతీ సెక్రటరీ, గ్రామానికి చెందిన జిల్లా స్థాయి క్రీడాకారుడు లేదా క్రీడాభివృద్ధికి ముందుకు వచ్చే దాత, స్థానిక హైస్కూల్ పీఈటీ సభ్యులుగా ఉంటారు. ఎంపీపీ చైర్మన్‌గా ఉండే ఎంఎస్ఏలో తహసీల్దార్, ఎంఈఓ, ఎస్ఐ మండల ఇంజనీరు, ఎంపీడీఓ, ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్, హెచ్ఎం, మండలం నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించిన పురుష, మహిళా క్రీడాకారులు (ఒక్కొక్కరు), సర్వచ్ఛంధ సేవకులు సభ్యులుగా ఉంటారు.

తరుచుగా టోర్నమెంట్ల నిర్వహణ..

గ్రామాల్లో క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా జగనన్న క్రీడా క్లబ్‌లు పనిచేస్తాయి. ప్రతి నెల గ్రామీణ, మండలస్థాయిలో టోర్నమెంట్లు నిర్వహిస్తారు. అందులో ప్రతిభ గల వారికి జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయిలో ఇంటర్ క్లబ్‌లు పోటీలు నిర్వహిస్తారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట..



ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోంది. ఇటీవల ఎస్‌జీఎఫ్ క్రీడలు కూడా ఎర్రగుంట్లలో నిర్వహించారు. రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. గతంలో ఎన్నడూలేని విధంగా జిల్లాలో క్రీడలకు మంచి స్పందన వచ్చింది.

నాగర్జునయ్య (ఫిజికల్ డైరెక్టర్, ఎర్రగుంట్ల జెడ్పీ బాయ్స్ హైస్కూల్)

26న ఉచిత కంటి వైద్యశిబిరం

వేంపల్లె : ఈనెల 26వ తేదీన ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వేంపల్లె మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ బి.చక్రపాణి రెడ్డి, అధ్యక్షుడు కావలి కృష్ణతేజ తెలిపారు. కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి, పులివెందుల సురక్ష ఐకేర్ వారిచే ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఈ మెగా వైద్య శిబిరం ఉంటుందన్నారు. కంటి పరీక్షలకు ఆరోగ్యశ్రీ, ఆధార్, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఈహెచ్ఎస్ కార్డులను వెంట తీసుకరావాలని సూచించారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

జమ్మలమడుగు : పట్టణ పోలీసులు మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని తేరో రోడ్డులో నివాసముంటున్న సునీత కూతురు రెండు సంవత్సరాల నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. దాతలు ఇచ్చిన సహాయంతో కూతురికి హైదరాబాద్‌లోని బసవతారకం ఆసుపత్రిలో చికిత్స అందిస్తోంది. సునీత ఇటీవల షోషల్‌మీడియాలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తన కూతురిని ఆదుకోవాలని రావడాన్ని గమనించిన పట్టణ సీఐ సదాశివయ్య, సిబ్బంది స్పందించి గరువారం తల్లి ఖాతాలో రూ.25వేలు నగదును వేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న జిల్లా ఎస్పీ అన్బురాజన్ సీఐ, సిబ్బందిని అభినందించారు.

ఘనంగా సుంకులమ్మతల్లి తిరునాల

జమ్మలమడుగు రూరల్ : మైలవరం మండలంలోని వద్దిరాల గ్రామంలో గురువారం జరిగిన గ్రామదేవత సుంకులమ్మతల్లి తిరునాల ఘనంగా జరిగింది. పలువురు నాయకులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ చైర్‌పర్సన్ వెంపలాకు లీలావతి ఆహ్వానం మేరకు వద్దిరాల గ్రామానికి వచ్చారు. నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచ బ్రహ్మానందరెడ్డి, జడ్పీ చైర్మన్ అకేపాటి అమరనాథ్‌రెడ్డి, నంద్యాల జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, వైస్ చైర్మన్ బాలయ్య తదితరులు హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం తేనీటి విందులో పాల్గొన్నారు. సాయంత్రం సిరిమాను మహోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన అకేపాటి..

వేసవికాలన్ని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు వెంపలాకు రామాంజనేయ యాదవ్ ప్రజల కోసం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మహాలక్ష్మీ, సర్పంచ్ జయశ్రీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ లక్షుమయ్య తదితరులు పాల్గొన్నారు.



సుంకులమ్మతల్లిని దర్శించుకుంటున్న జడ్పీచైర్మన్ అకేపాటి అమరనాథ్‌రెడ్డి

పోషకాలున్న ఆహారం తీసుకోవాలి

కమలాపురం : గర్భిణులు, బాలింతలు, చిన్నారులందరూ పోషకాలున్న ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయకుమారి తెలిపారు. ఈనెల 20వ తేదీ నుంచి జరుగుతున్న 5వ పోషణ్ పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక 7వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషక విలువలు అధికంగా ఉన్న ఆకు కూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు తదితర వాటితో పోషణ్ పక్వాడ లోగో ఏర్పాటు చేశారు. గర్భిణులు, బాలింతలకు పోషణ్ పక్వాడ గురించి అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో అనీమియా, రక్తహీనతను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషణ్ పక్వాడ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా పోషక విలువలు అధికంగా ఉన్న పాలు, గుడ్లు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు అధికంగా తీసుకోవాలన్నారు. అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి, 1వ సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ జయకుమారి

పలు చోట్ల చలివేంద్రాలు ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ పి.జగన్నాథ్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్‌సీ పుల్లారెడ్డి

ఎర్రగుంట్ల : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సౌజన్యంతో ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలోని రాణీవనంలో గురువారం చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవ సంస్థ మండల చైర్మన్ రఘురామిరెడ్డి, డాక్టర్ రామాంజనేయరెడ్డి, మేడా రమేష్‌బాబు, జీరెడ్డి మల్లిఖార్జునరెడ్డిలు పాల్గొన్నారు.

చెన్నూరు : కడప–కర్నూలు జాతీయ రహదారిలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు తనిఖీ కేంద్రం వద్ద వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పుల్లారెడ్డి, సెక్రటరీ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రఓబుల్‌రెడ్డి, టీఎన్ చంద్రారెడ్డి, భాస్కర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం : స్థానిక మార్కెట్ యార్డు తనిఖీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్‌సీ పుల్లారెడ్డి ప్రారంభించారు. గురువారం వేసవి కాలం ప్రారంభం కావడంతో చలి వేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు సెక్రటరీ వరప్రసాద్ రెడ్డి, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పులివెందుల : పులివెందుల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పులివెందుల, వేముల, లింగాల, సింహాద్రిపురం మండలాలకు సంబంధించి అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ శ్రీలత తెలిపారు. అందుకు సంబంధించి పులివెందుల రాజలక్ష్మి హాల్ అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టు ఓసీ, వేముల మండలం నారేపల్లె అంగన్‌వాడీ వర్కర్ బీసీ–బి, సింహాద్రిపురం అహోబిలాపురం మినీ అంగన్‌వాడీ కార్యకర్త ఎస్సీ, లింగాల మండలం కె.చెర్లోపల్లె మినీ అంగన్‌వాడీ కార్యకర్త బీసీ–ఈ, తొండూరు యాదవారిపల్లె మినీ అంగన్‌వాడీ కార్యకర్త ఎస్సీలకు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. ఈనెల 27వ తేదీలోపు వాటికి సంబంధించిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో మండంలోని ఆర్ఎస్‌వై కాలనీ–ఎస్టీ, బాబానగర్–బీసీ–బీ, అంగడివీధి–బీసీ–ఇ, ఎన్ఆర్‌పల్లి–బీసీ–సీలకు కేటాయించినట్లు ఆమె తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 27వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28న కడప నగరంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

పెండ్లిమర్రి : ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పెండ్లిమర్రి మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపర్ వైజర్ ఓబులమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈనెల 27వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మండలంలోని పాతసంగటిపల్లె అంగన్‌వాడీ వర్కర్(బీసీ–ఏ) కేటాయించారన్నారు. అర్హత, అసక్తిగల అభ్యర్థులు తమ పూర్తి బయోడాటాతో కడప రూరల్ ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

కరువుభత్యం వెంటనే ప్రకటించాలి

జమ్మలమడుగు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వవలసిన బకాయిలను వెంటనే ఇవ్వాలని రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సందిళ్ల సుబ్బరాజుయాదవ్ కోరారు. గురువారం స్థానిక ఆర్ అండ్‌బి అతిథి గృహంలో ఎస్టీఎఫ్ నాయకుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రేపు వారపు సంత వేలంపాట

సింహాద్రిపురం : మండల కేంద్రం సింహాద్రిపురంలో ప్రతి ఆదివారం జరిగే వారపు సంత రుసుము వసూలు చేయుటకు శనివారం మధ్యాహ్నం రెండుగంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పి.రామ్మోహన్, ఉపసర్పంచ్ లక్ష్మిపద్మజ, పంచాయతీ కార్యదర్శి హరికిషోర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారపు సంత వేలంపాటలో పాల్గొనువారు గ్రామ పంచాయతీకి ఎలాంటి బకాయిలు లేకుండా ఉండాలని..రెండు లక్షల డిపాజిట్ చేసి పాటలో పాల్గొనాలని వారు తెలిపారు. ఆసక్తి గలవారు ఈ వేలం పాటలో పాల్గొనవచ్చని వారు తెలిపారు.

చెన్నూరులో..

చెన్నూరు : స్థానిక గ్రామ పంచాయతీ 2023–24 సంవత్సరానికి గాను బస్టాండు, కూరగాయల మార్కెట్, జంతువధశాలలకు సంబంధించి సర్పంచ్ సిద్దిగారి వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి రామసుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనదలిచిన వారు పంచాయతీకి ఇంటి పన్ను, నీటి పన్ను బకాయిలు ఉండకూడదన్నారు. వేలం పాటకు సంబంధించిన డిపాజిట్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని వారు తెలిపారు.

29న గుట్టరాళ్ళ టోల్‌గేట్..

చింతకొమ్మదిన్నె : కొలుముపల్లి పంచాయతీ పరిధిలోని పునాదిరాళ్ళు తరలించుకునే వాహనాలకు సంబంధించిన టోల్‌గేట్‌కు వేలం పాటను నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి జి.ఎల్.నారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఆయన పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వేలం పాటలో పాల్గొనే వారు పంచాయతీ కార్యాలయం పేరు పైన ఎస్‌బీఐ బ్యాంకులో రూ.20 వేలు డీడీ తీసి పాటలో పాల్గొనాలన్నారు. హెచ్చు పాటదారుడు మిగిలిన మొత్తాన్ని పాట అనంతరం చెల్లించాలన్నారు.

ఓటర్లు ఆధార్ అనుసందానం చేసుకోవాలి

కొండాపురం : మండలంలోని ఓటర్లు తప్పనిసరిగా బిఎల్‌ఓల ద్వారా గరుడా యాప్‌లో ఆధార్ అనుసంధానం చేసుకోవాలని మండల తహసీల్దార్ శోభనబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలలోని ఓటర్ కార్డుకు ఆయా గ్రామ బిఎల్‌ఓలు వెంటనే ఆధార్ నెంబర్ లింక్ చేసుకోవాలన్నారు. ప్రతి ఓటర్ కార్డుదారుడు తమ బిఎల్‌ఓలను సంప్రదించి ఆధార్‌నెంబర్‌కు లింక్ చేసుకోవాలన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకుపోవాలి

పులివెందుల టౌన్ : విద్యార్థులు ఒక లక్ష్యంతో ముందుకు పోవాలని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంఎస్ బేగ్ అన్నారు. గురువారం ఆ కళాశాలలో విద్యార్థులకు ఉగాది పర్వదినం యొక్క విశిష్టతను తెలిపే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల జీవితాల్లో కూడా ఉగాది వలే కొత్త వెలుగులు విరబూయాలన్నారు. ఉన్నత శిఖరాలను అదిరోహించాలన్నారు.

'ఎన్‌డీఆర్ఎఫ్'స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- తహసీల్దార్ గంగయ్య
- మామిళ్లపల్లె ఎన్‌సీసీ ప్రాంగణంలో కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ ద్వారా సామాజిక అవగాహన కార్యక్రమం



ప్రమాదకర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఎన్‌డీఆర్ఎఫ్ టీమ్ ప్రదర్శన

కడప సెవెన్‌రోడ్స్ : విపత్కర పరిస్థితుల్లో ఎన్‌డీఆర్ఎఫ్ టీమ్ సహాయక చర్యల స్ఫూర్తితో సమాజంలో ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా కాపాడే సామాజిక బాధ్యత అందరిపై ఉందని సీకే దిన్నె తహసీల్దార్ గంగయ్య తెలిపారు. కలెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ శివకుమార్ ఆధ్వర్యంలో సీకే దిన్నె మండల పరిధిలోని మామిళ్లపల్లె ఎన్‌సీసీ శిక్షణ ప్రాంగణంలో ప్రమాదాలు సంభవించినపుడు వెంటనే ప్రాణాలను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ ద్వారా సామాజిక అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల తహసీల్దార్ గంగయ్య, స్థానిక కార్పొరేటర్ చంద్రహాసరెడ్డి, అగ్నిమాపకశాఖ ఎస్ఐ జలీల్, ఎన్‌సీసీ సూపరింటెండెంట్ సుబేదా హానుమాన్‌సింగ్‌లు హాజరై పలు సూచనలు చేశారు. అనంతరం ఎన్‌డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలో విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలను, మాక్ ఎక్స్‌ఫర్మెంట్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్‌డీఆర్ఎఫ్ ట్రైనింగ్ టీమ్ లీడర్ మహమ్మద్ అలీ, ఎన్‌సీసీ క్యాడెట్లు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పాత్రికేయుల సేవలు అభినందనీయం

కమలాపురం : సమాజంలో ప్రభుత్వానికి, అధికారులకు, ప్రజలకు వారధిగా ఉన్న పాత్రికేయుల సేవలు అభినందనీయం అని మండల తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం నేషనల్ సేవ్ జర్నలిస్ట్ డే ను పురస్కరించుకుని తహసీల్దార్ కార్యాలయంలో కేక్ కట్ చేసి సిబ్బందికి పంచి పెట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సమాజంలో అంకిత భావంతో పేద ప్రజల తరఫున నిత్యం పోరాడుతూ, ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉన్న పాత్రికేయుల సేవలు అభినందనీయం అన్నారు. అనంతరం పాత్రికేయులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు సుబ్బారెడ్డి, జాషువ పీటర్, వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్ర, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ ఉగాది సంబరాలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా గురువారం కోలా ప్రసాద్ సహకారంతో విజయవాడ ఎక్సలెంట్ ఇన్‌స్టిట్యూట్ వారి పులివెందుల చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.



చిన్నారుల నృత్య ప్రదర్శనలు

ఆలయానికి విరాళం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పురావస్తుశాఖ సహాయ ఆచార్యులు దివంగత వి.రామబ్రహ్మం, పరిశోధక బృందం చేపట్టిన పరిశోధనల ఫలితంగా వల్లూరు మండలం పెద్దపుత్త గ్రామంలోని శ్రీయోగాభిరామాలయం వెలుగులోకి రావడంతో ఆ ప్రాంతవాసులు ఆలయానికి విరాళం అందించారు. ఆలయ అభివృద్ధి కోసం యూఎస్ఏకి చెందిన చిట్టప్రగడ లలిత, రాజమండ్రికి చెందిన జి.వి.రమణ, డా. టి.వి.నారాయణరావులు రూ.1 లక్ష విరాళం అందజేశారు. ఆలయానికి సంబంధించిన చారిత్రక అంశాలను వైవీయూ సహాయ ఆచార్యులు డా. వి. రామబ్రహ్మం, సహ పరిశోధకులు డా. చల్లా శివకుమార్. డా. జంగారి నారాయణలతో కలిసి వెలుగులోకి తీసుకువచ్చారు. ఆలయ చరిత్రను తెలుసుకున్న వీరు పెద్దపుత్తలోని శ్రీయోగాభిరామాలయాన్ని సందర్శించారు. మూలవిరాట్టును దర్శించుకుని సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు నిధులు ఖర్చుచేయాలని ఆలయ నిర్వాహకులను కోరారు.



పెద్దపుత్త గ్రామంలోని ఆలయం వద్ద దాతలు, పరిశోధకులు

ఘనంగా కుందేళ్ల పారువేట ఉత్సవం



సింహాద్రిపురంలో అమ్మవారి గ్రామోత్సవం



కుందేళ్లను వెంబడించేందుకు సిద్ధమవుతున్న యువకులు, చిన్నారులు

లింగాల : మండల కేంద్రంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కుందేళ్ల పారువేటను నిర్వహించడం ఆనవాయితీగా సాగుతోంది. గురువారం ఎగువలింగాల రామాలయంలో భక్తులు పూజలు నిర్వహించి స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగింపుగా గ్రామ సమీపంలోని బీడు పొలాల్లోకి కుందేళ్లను తీసుకొచ్చారు. అనంతరం గ్రామ పొలాల్లో పల్లకి ఉంచి కుందేళ్ల పారువేటను ప్రారంభించారు.

గ్రామంలోని యువకులు, మహిళలు, చిన్నారులు భారీగా తరలి వచ్చి కుందేళ్ల పారువేటలో పాల్గొన్నారు. కుందేళ్లను ఒక్కొక్కటిగా పొలాల్లో వదిలిపెట్టి వాటిని వెంబడించి పట్టుకున్నారు. ఈ విధంగా నిర్వహించడం వల్ల వర్షాలు బాగా పడటమేకాకుండా పంటలు పుష్కలంగా ఉంటాయని ఇక్కడి ప్రజల నమ్మకం.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మగూడూరులో గురువారం కుందేళ్ల పారువేటను నిర్వహించారు. ఉగాది పండుగ మరుసటిరోజు నిర్వహించే కుందేళ్ల పారువేట అమ్మవారి సమక్షంలో నిర్వహించారు. యువకులు, పెద్దలు ఎంతో ఉత్సాహంగా కుందేళ్ల పారువేటలో పాల్గొన్నారు. రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.